ప్రజాశక్తి
సోమవారం 14 జులై 2025
5
కర్నూలు

పంట పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

'స్మార్ట్ మీటర్ల' రద్దుకు పోరాటం

- నేడు విద్యుత్ సౌధ వద్ద సిపిఎం ధర్నా
- జయప్రదానికి నాయకులు పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/కర్నూలు కార్పొరేషన్

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును ఆదాని గ్రూప్ సంస్థకు ఇచ్చింది. విడతల వారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయగా రెండో విడతలో వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటి వరకూ లక్షకు పైగా స్మార్ట్ మీటర్లను బిగించారు. ఆ తరువాత మూడో విడతగా గృహలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్‌పెయిడ్ విధానంలోనే బిల్లులు వసూలు చేస్తున్నారు. కర్నూలు 45వ వార్డులో అజీముద్దీన్‌నగర్ నివాసంలో ఉంటున్న వెల్డింగ్‌షాపు యజమాని జెఎండి ఉస్మాన్‌బాషకు పాతమీటర్లు ఉన్నప్పుడు నెలకు రూ.3380 వచ్చేది. స్మార్ట్ మీటరు బిగించాక మొదటి బిల్లు రూ.30,758 వచ్చింది. కెపాసిటర్ వాడినందుకు వచ్చిందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇంతబిల్లు ఎలా కట్టాలి తగ్గించాలని వినియోగదారుడు ఉస్మాన్‌బాష అధికారులను కోరితే తగ్గించే అవకాశం లేదని, చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఇలా ఆయనతో పాటు పలువురికి స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటరకు ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుంది. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సోమవారం కర్నూలులోని విద్యుత్ సౌధ వద్ద ధర్నా చేపట్టనున్నారు. ఆ ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు కోరారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాముడు

ఇంటింటి ప్రచారం..

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 42 వార్డు బాలగంగాధర్ తిలక్ నగర్, చల్ల వారి వీధి మొదలగు ప్రాంతాలలో సిపిఎం వార్డు కార్యదర్శి సి.చలపతి అధ్యక్షతన స్మార్ట్ మీటర్ల పై పోరు బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంచారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు వివరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి.రాముడు, నగర నాయకులు కె.ప్రభాకర్, వార్డు కార్యదర్శి సి.చలపతి మాట్లాడారు. ఈనెల 14న ఉదయం 10 గంటలకు కర్నూలు విద్యుత్ సౌధ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేయబోతున్నామని ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ వార్డు నాయకురాలు జె. కిరణ్మయి, రామకృష్ణ, బి.రాము, పురుషోత్తం వార్డు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల మెడలో ఉరితాళ్ళుగా స్మార్ట్ విద్యుత్ మీటర్లను బిగిస్తున్నారని దీన్ని ప్రజలు తిరస్కరించాలని సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి.షరీఫ్, నగర నాయకులు మద్దిలేటి ప్రజలను కోరారు. ఒకటో వార్డు ఖండేరి వీధి, చిదంబరావు వీధి, కురవ వీధి, బుడాబుడి మసీద్ వీధి, రాఘవేంద్ర స్వామి గుడి లైన్ అలాగే అబుబకర్ సిద్ధిక్ మసీదు లైన్ తదితర వీధులలో సిపిఎం ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన ప్రచారం నిర్వహించారు. ఎర్ర శీను ,నాగరాజు ,ఎల్లప్ప, ఎంపీ సుంకన్న, గోపాల్, సతీష్, గిడ్డయ్య, ఫిలాప్ ,శివశంకర్ పరశు రామ్ పాల్గొన్నారు.

పత్తికొండ: రాష్ట్ర పభుత్వం స్మార్ట్ మీటర్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాల్సిందేనని సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. పత్తికొండ సిపిఎం నాయకులు 18,19 వార్డుల్లోని ఇంటింటికి తిరిగి స్మార్ట్ మీటర్ కరపత్రాలను పంచుతూ ప్రజలకు వివరించారు. సిఐటి నాయకులు రవిచంద్ర డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు దుగ్గిన, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు రాజన్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు చికామణి బూజులు ,తదితరులు పాల్గొన్నారు.

కోసిగి : మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

కోసిగి: స్మార్ట్ మీటర్ల బిగించడానికి వ్యతిరేకిస్తూ , ట్రూ ఆఫ్ చార్జీలను రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో 14న స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, మండల నాయకులు రాముడు వీరేష్ తెలిపారు. ఆదివారం స్మార్ట్ మీటర్లు వద్దు ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ మండలంలోని ఆర్లబండ, కామాన్ దొడ్డి, కడిదొడ్డి, కందుకూరు, కోసిగి గ్రామాల్లో కరపత్రాల ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగేంద్ర, గోపాల్, పూజారి శ్రీనివాసులు, వీరేష్, అమీర్, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్

మా భూముల జోలికొస్తే ప్రతిఘటిస్తాం

- పుల్లగుమ్మి రైతులకు అండగా ఉంటాం
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి-వెల్దుర్తి

మా భూముల దగ్గరకు వస్తే ప్రతిఘటిస్తామని, వెల్దుర్తి మండలం పుల్లగుమ్మి రైతులు హెచ్చరించారు. పుల్లగుమ్మి రైతులకు అండగా ఉంటామని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి ఎ.కృష్ణ తెలిపారు. పుల్లగుమ్మి బాధిత రైతులతో కలిసి ఆదివారం భూములను పరిశీలించారు. పుల్లగుమ్మి బాధిత రైతులతో కలిసి జి.రామకృష్ణ, ఎ.కృష్ణ ఐరన్ ఓర్ కంపెనీ వల్ల నష్టపోయి పొలాలను అన్నింటిని సుమారు మూడు గంటల దాకా కలియదిరిగారు. వారు మాట్లాడుతూ పుల్లగుమ్మిలో ఉండే రైతులు అందరూ కూడా సన్న చిన్న కారు రైతులేనని అన్నారు. అత్యంత పేద రైతులు వారి తాతల కాలం నుండి ప్రభుత్వ భూమిని చదును చేసి ఎంతో కష్టపడి నేడు బోరు బావులు వేసుకుని సర్కారు ఏరియాను తలపించే విధంగా పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మడ్డి పెద్ద రాముడు ఆయనకు ఉండే 1 1/2 పొలంలో మదనపల్లిలో పండించే రకంగా టమేటా పంటను అద్భుతంగా పండిస్తున్నారన్నారు. ఆయన ఒక్కడే కాదు ఇక్కడ ఉన్న భూమి బాధిత రైతులు సుమారు 150 మంది పచ్చిమిర్చి ,ఉల్లి టమేటా మామిడి, మొక్కజొన్న, సద్దలు, కందులు , వివిధ రకాల పంటలు అద్భుతంగా పండిస్తున్నారని తెలిపారు. ఇటువంటి సమయంలో బ్రహ్మ రాక్షసి రూపంలో సీతారామయ్య మైన్ ఓనర్ వచ్చి రైతుల గుండెలు ఆగిపోయేలాగా ఐరన్ ఓర్ మైనింగ్ గురించి రైతులు తెలుసుకని భవిష్యత్తు ఏమిటని ఆందోళన పడుతున్నారని తెలిపారు. ఎవరైనా కళ్ళు ఉన్న అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలన చేస్తే వారి భూములను చూసినట్లయితే అక్కడ మైనింగ్ లీజు నిరాకరిస్తారన్నారు. ఎన్ఒసి ఇవ్వరు అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఆదాయమే అవసరం అనుకుంటే ప్రకృతికి హాని జరగని వ్యవసాయం చేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచుతామని తెలిపారన్నారు. మైనింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా సంయుక్తంగా పరిశీలన చేసి అక్కడి పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి సీతారామయ్యకు ఇచ్చిన మైనింగ్ లీజును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లీజు రద్దు చేయకుండా కుంటి సాకులు చెప్పి కాలయాపన చేస్తే దశల వారి ఆందోళన చేయడానికి పూనుకుంటామని రైతులు, రైతుసంఘం నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు జనార్ధన్, శంకర్, శ్రీనివాసులు, లక్ష్మన్న ,రంగస్వామి, శివన్న, పూరిసేటి శివన్న, మెంతు లక్ష్మన్న, తలారి బాలు, రమేష్, ఈశ్వర్ రెడ్డి, మార్యాపురం, సుబ్బారెడ్డి, తలారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ కార్యాలయంలోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల రెవెన్యూ డివిజనల్ కేంద్రాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధితులు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

నీట్ అకాడమీకి ఎంపికైన విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతిష్టాత్మకమైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ఐఐటి నీట్ అకాడమీ కు ఎంపికైన విద్యార్థి జస్వంత్‌ను పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఉమా మహేశ్వర్‌తో మాట్లాడుతూ విద్యార్థి జస్వంత్ కు ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. వడ్డెమాను జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదివి టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించి గురుకుల అకాడమీకి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థి జస్వంత్ ఇక్కడ అడ్మిషన్ పొందడానికి కృషిచేసిన గణిత ఉపాధ్యాయుడు ఈశ్వరయ్యను కూడా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం జస్వంత్ కు ప్రోత్సాహ బహుమతిని కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు ఈశ్వరయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, తమ దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు కె.నిఖిల్, భరత్, కృష్ణ ఈశ్వరయ్య అభినందించారు.



విద్యార్థి జస్వంత్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ తదితరులు

డివైఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్లా

రాఘవేంద్ర

అబ్దుల్లా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా 19వ మహాసభ జూలై 11,12 వ తేదీల్లో ఘనంగా నిర్వహించామని, చివరి రోజున జిల్లా నూతన కమిటీని మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని రాష్ట్ర ట్రెజరర్ నగేష్ తెలిపారు. ఆదివారం కొత్త బస్టాండు దగ్గర ఉన్న డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా రాఘవేంద్ర, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్లా, ఉపాధ్యక్షులుగా హుస్సేన్‌బాష, మైన, శిరీష, వీరేష్ సహాయ కార్యదర్శులుగా ప్రకాష్, మధు, వీరేష్ వీరితో పాటు 27 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు. అనంతరం డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాఘవేంద్ర,అబ్దుల్లా మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో దాదాపు నాలుగు లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగం లేక ఉపాధి లేక ఉన్నారని అన్నారు. వీరి సంఖ్య రాబోయే రోజుల్లో పెరిగే అవకాశం కూడా ఉందని అన్నారు. ఇలాంటి తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా భిన్నంగా ఉన్న ఉద్యోగాలు తొలగించడం ఆందోళన కలిగిస్తుందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల విప్లవం కూటమి ప్రభుత్వం చేస్తుందని ఇప్పటికే 9 లక్షల కోట్ల పెట్టు బడులు వచ్చాయని ముఖ్యమంత్రి ప్రకటిస్తున్నారని. రూ.తొమ్మిది లక్షల కోట్ల పెట్టుబడులకు ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తూ. నిరుద్యోగులను మోసం చేయడం ఆపి వెంటనే 20 లక్షల ఉద్యోగాలకు కషి చేయాలని, వెంటనే నిరుద్యోగ భతి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆదోనిలో జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లులు, ఎమ్మిగనూరు టెక్స్టైల్ పరిశ్రమ, పత్తికొండలో టమాటో జ్యూస్ పరిశ్రమ, ఓర్వకల్ ఇండస్ట్రియల్ హబ్ వెంటనే ఏర్పాటు చేసి ఉద్యోగాల విప్లవం తీసుకురావాలని ప్రభుత్వానికి తెలియజేశారు.అలాగే మహాసభలలో అనేక సమస్యలపై తీర్మానాలు చేశామని గ్రామీణ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నూతనంగా ఎన్నికైన డివైఎఫ్ జిల్లా కమిటీ

మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

థైరాయిడ్ జబ్బులపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

థైరాయిడ్ చాలా ముఖ్యమైన గ్రంధి అని వాటికి సంబంధించిన వివిధ రకాల జబ్బుల గురించి పీజీలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ అన్నారు. ఆదివారం డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలోని మెడికల్ కాలేజీలోని ప్రతి విభాగం సంవత్సరానికి నాలుగు సిఎంఇ (కరెంట్ మెడికల్ ఎడ్యుకేషన్) వివిధ కాలేజీలలో చేయాలన్న ఆదేశాల మేరకు జోనల్-6 లో కర్నూలు మెడికల్ కాలేజీ, అనంతపురం గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ, కర్నూలు విశ్వభారతి మెడికల్ కాలేజీ పీజీ విద్యార్థులకు కర్నూలు మెడికల్ కాలేజీలో ఆదివారం జనరల్ సర్జరీ విభాగపు అధిపతి డాక్టర్ పి.హరి చరణ్ ఆధ్వర్యంలో థైరాయిడ్ జబ్బులకు సంబంధించిన సిఎంఇ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ థైరాయిడ్ చాలా ముఖ్యమైన గ్రంధి అని వాటికి సంబంధించిన వివిధ రకాల జబ్బుల గురించి పీజీలకు అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ థైరాయిడ్ గ్రంధి సైజు పెరిగినప్పుడు తప్పకుండా సర్జరీలకు చూపించుకుని దానికి పరీక్షలు చేయించుకుని అవసరమైన చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ సిఎంఇలో థైరాయిడ్ గ్రంధి కి సంబంధించిన వివిధ వ్యాధుల గురించి అందులో వచ్చే వివిధ రకాల క్యాన్సర్ల గురించి వాటి ట్రీట్మెంట్ గురించి వివిధ విభాగాల ప్రొఫెసర్ అవగాహన కల్పించారు. అనంతరం నాలుగు కాలేజీల పీజీలకు జరిగిన క్విజ్ పోటీలలో కర్నూలు మెడికల్ కాలేజీ పీజీలు ప్రథమ స్థానం పొందారు. నంద్యాల శాంతిరాం మెడికల్ కాలేజీ పీజీలు రెండవ స్థానం పొందారు. కర్నూలు మెడికల్ కాలేజీ జోనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సాయి సుధీర్, సిఎంఇ అబ్జర్వర్ డాక్టర్ విశాల, జోనల్ సిఎంఇ సర్జరీ కోఆర్డినేటర్ డాక్టర్ మాధవి శ్యామల, వైద్యులు పాల్గొన్నారు.

పెండింగ్ డిఎలను విడుదల చేయాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ డిఎల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు గోకారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారంకాకినాడలో నిర్వహించిన ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్‌ను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలన్నారు. బదిలీ, పదోన్నతులు పొందిన వారిని అందరిని వెంటనే రిలీవ్ చేసి వారి స్థానంలో విద్యా వాలంటీర్లను యమించాలన్నారు.

ఫలితం వచ్చే దాకా నిరంతర కార్యక్రమాలు

-ఎపి రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు తీర్మానం
- 12 తీర్మానాలను ఆమోదించిన సదస్సు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

తెలుగుభాష పరిరక్షణకు నడుంబిగించాలని , పాలకులు స్పందించి ఫలితం వచ్చే వరకు నిరంతర కార్యక్రమాలు చేపట్లాలని, సిఎం, ఎమ్మెల్యే, ఎంపీ, తదితర అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని రెండో రోజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు తీర్మానించింది. ప్రపంచ తెలుగు దినోత్సవాన్ని కర్నూలు లోనే జరపాలని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి.వెంకటేష్ అన్నారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు కర్నూలు టిజివి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. తూమాటి సంజీవరావు రచించిన 'విశిష్ట తెలుగు దిగ్దర్శనం' పుస్తకాన్ని టిజి.వెంకటేష్, విశ్రాంత ఐఎఎస్ అధికారి నందివెలుగు ముక్తేశ్వరరావు ఆవిష్కరించారు. టిజివెంకటేష్ మాట్లాడుతూ తెలుగు భాషకు సంబంధించిన పుస్తకాలు సజీవంగా ఉండే విధంగా నెట్లో పెట్టాలని ఆయన ఆకాంక్షించారు. తెలుగు ప్రాముఖ్యతను వివరిస్తూ హిందీ తర్వాత రెండవ స్థానంలో తెలుగు ఉందన్నారు. ఎపి రాష్ట్ర స్థాయి తెలుగు భాషా పరిరక్షణ సదస్సు నిర్వాహకులకు టిజి.వెంకటేష్ రూ.50వేలు విరాళం ప్రకటించారు. తెలుగు మాట్లాడే వారంతా తెలుగు బిడ్డలేనని, తెలుగు భాష బ్రతికించేందుకు ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలోని నలుమూలలనుంచి వచ్చిన తెలుగు భాషా పరరక్షణకు సదస్సుకు వచ్చిన ప్రతినిధులను శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. విశ్రాంత ఐఎఎస్ ముక్తేశ్వరరావు మాట్లాడుతూ 1953లో భాషా ప్రయుక్త రాష్ట్రాల నుండి విడిపోయిన ఆంధ్రప్రదేశ్ పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం ఫలితంగా తెలుగులో పాలన సాగిందన్నారు. ఆ సమయంలో ఐదు భాషల్లో ఐఎఎస్ లకు శిక్షణ ఇచ్చేవారని తెలిపారు. ప్రజల నుండి భాష నేర్చుకోకపోతే అలాంటి వ్యక్తి పాలకుడు కాడని తెలిపారు. పాలకులు ప్రజలు ఎక్కడైతే కలిసి పని చేస్తారో అక్కడ విజయం సాధిస్తారని తెలిపారు. ప్రజలకు అనుగుణంగా పాలన సాగాలని దేశంలోని ప్రజలను ప్రేమించాలని అన్నారు. అందరం కలికట్టుగా తెలుగు భాష ప్రాముఖ్యతను కాపాడుకోవాలని సూచించారు. 26 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధులు, తెలుగు భాషాభిమానుల మధ్య 12 తీర్మానాలను ఆమోదించారు.

ఒకటి నుండి 5వ తరగతి వరకు ప్రతి ప్రైవేటు ప్రభుత్వ పాఠశాలలో తెలుగులోనే బోధన జరగాలి. టెన్త్ క్లాస్ వరకు తెలుగు కచ్చితంగా రెండు పీరియడ్లు బోధించాలి. ఇంటర్మీడియట్లో తప్పనిసరిగా తెలుగు ప్రధాన అంశంగా ఉండాలి. డిగ్రీ స్థాయి వరకు పీజీ స్థాయి వరకు, వృత్తి సాంకేతిక విద్యల్లో కూడా తెలుగు ఒక అంశంగా బోధించాలి. ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు, వినతి పత్రాలు, జారీ చేసే ఉత్తర్వులు తెలుగులోనే ఉండాలి. పొరుగు రాష్ట్రాలు తమిళం కర్ణాటక వాళ్ళు ఎలాగైతే తమ భాషను రక్షించుకుంటూ ఉన్నారో కాపాడుకుంటున్నారో మనం కూడా ఆ దిశలో మన ఆస్తి అయిన మన తెలుగు భాషను ఉద్ధరించు కోవాలి. అందరిని కలుపుకొని ప్రభుత్వానికి వినతి చేయాలని తదితర తీర్మా నాలను ఆమోదించారు.

ఈసదస్సులో అధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూర, సంచాలకులు పత్తి ఓబులయ్య , ఉపాధ్యక్షులు జెఎస్ఆర్‌కె శర్మ, కార్యదర్శి డాక్టర్ పార్వతీదేవి దండబోయిన, నరసం అధ్యక్షులు కావెం సుబ్బలక్ష్మి, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ ఎన్.శమంతకమణి, తెలుగు అధ్యాపకులు శ్యామసుందర శాస్త్రి, ఎంజలక్ష్మయ్య, గుబ్బ బాలస్వామి, హైమావతి, సునీత, నీలిమ, సుబ్బలక్ష్మి, నంద్యాల అన్నం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. కర్నాటి చంద్రమౌళి 'కర్నూలుకు వస్తావా మా ఊరు చూస్తావా? కర్నూలు గొప్పదనం గురించి, ఆర్ఎ సుజాత 'విన్నాను అమ్మ ఒడిలో కమ్మనైన తెలుగు ప్రసరించెను నా మదిలో విజ్ఞానపు వెలుగు', పిఎన్ఎం జిల్లా అధ్యక్షుడు ఎంపి బసవరాజు 'తేట తేట తెలుగు మా భాష తెలుగు మా ఇంటి వెలుగు' అంటూ గేయాలు ఆలపించారు. పిఎన్ఎం కళాకారుడు సుబ్బరాయుడు డప్పు సహకారాన్ని అందించారు. అనంతరం కరీముల్లా బృందం నత్య ప్రదర్శన చేసిన వారందరిని ఘనంగా సన్మానించారు.

ఆయా జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులను అభినందిస్తున్న టిజి వెంకటేష్, ముక్తేశ్వర రావు

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూ సిటీ మూడవ నగర మహాసభలోసంక్షేమబోర్డును పునరుద్ధరించాలని కోరుతూ తీర్మానం చేసినట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ చెప్పారు. ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘం న్యూ సిటీ కమిటీ మూడవ నగర మహాసభ కెకె.భవన్‌లో నగర అధ్యక్షులు కె. సుధాకరప్ప అధ్యక్షతన నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు భవన నిర్మాణ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ చేశారు. జెండాను యూనియన్ అధ్యక్షులు కె. సుధాకరప్ప ఆవిష్కరణ చేశారు. నగర మహాసభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు జిల్లా అధ్యక్షులు పి ఎస్. రాధాకృష్ణ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఖాజా పాషా, గౌరవ అధ్యక్షులు టి. రాముడు మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు ఉదయం లేచినప్పటి నుండి ఉదయం పనితో ప్రారంభమై రాత్రి వరకు పని చేసిన కుటుంబం గడవని పరిస్థితి ఉందన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా రన్నారు. ప్రభుత్వం కార్మికులకు పనులు కల్పించి ఆదుకోవడంలో ఘోరంగా విఫలమైందన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వైసిపి ప్రభుత్వం 12, 14 జీవోను తీసుకొచ్చి నిలిపేసిందన్నారు. కార్మికులపట్ల కర్కశంగా వ్యవహరించి అన్యాయం చేసిందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే నిలిచిపోయిన సంక్షేమ బోర్డును పునరుద్దరిస్తామని ఎన్నికల ముందు వాగ్దానం చేసి కార్మికుల ఓట్లను కొల్లగొట్టిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ బోర్డ్ గురించి మాట్లాడటం లేదని, ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చి ధర్నాలు చేసిన పట్టించుకోకుండా సంక్షేమ బోర్డును ప్రారంభించడంలో నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. ఇచ్చినమాట తప్పిన కూటమి ప్రభుత్వాన్ని నిలదియాల్సిన అవసరం ఉందన్నారు. కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఆర్. నరసింహులు పెయింటర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు మాభాష, జాఫర్ హుస్సేన్‌లు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు గౌండాలు పెయింటర్స్, కార్పెంటర్స్, ఎలక్ట్రీషన్, పాలిష్ బండలు ,మట్టి పని, ప్లంబరు మొదలగు 26 రంగాలకు చెందిన కార్మికులు అందరూ ఐక్యమై ఉద్యమించి పోరాటం ద్వారా సంక్షేమ బోర్డును సాధించుకోవాలని కోరారు. అడిగితే వచ్చేది భిక్షం, పోరాడితే వచ్చేది హక్కు అన్నారు. మట్టి పని అడ్డాలలో షెడ్లు నిర్మించి, మరుగుదొడ్లు, మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. భవననిర్మాణరంగానికి ఉపయోగించే ఇనుము, సిమెంటు మొదలగు వస్తువుల ధరలు తగ్గేవరకు భవన నిర్మాణ కార్మికులకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు ఉచితంగా నిర్మించాలన్నారు. నూతన నగర కమిటీని 23 మందితో ఎన్నుకున్నారు. నగర ప్రధాన కార్యదర్శిగా ఆర్ నరసింహులు, నగర అధ్యక్షులుగా ఎస్ మా బాష, నగర ఉపాధ్యక్షులు కె .సుధాకరప్ప, ఆర్.మద్దిలేటి, వై.శంకర్, ఎంజె.ఈశ్వరమ్మ, సహాయ కార్యదర్శులు ఎసు, జలాలుద్దీన్, మక్బుల్ బాష ,అయ్యమ్మ, కోశాధికారిగా ఎస్.రెహమాన్. కమిటీ సభ్యులు మునిస్వామి, ప్రభాకర్, రాజు, పురుషోత్తం, వహీద్, జి.లక్ష్మన్న, శేఖర్, నరసింహులు, దాస్, జానకి రామ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు పిఎస్ రాధాకృష్ణ

మెరుగైన పాలన అందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సి బెళగల్

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. ఆదివారం కొండాపురం, పలదొడ్డిలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆది వారం ఏడాది సుపరి పాలనపై జోరుగా ప్రచారం కొనసాగించారు. ఇక్కడే నాయకులు రఘునాథ్ రెడ్డి రంగస్వామి, వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ చంద్రశేఖర్, సొసైటి చైర్మన్ చిన్న తిమ్మప్పలు పాల్గొని ఆయన ప్రచార బాటలో నడిచారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి తెలిపారు. ఇందుకు ప్రజలు ప్రతి పక్షపార్టీల దుస్ప్రచారాలు నమ్మకూడదన్నారు.ప్రతి ఒక్కరికి పథకాలు దరి చేరేలా సమస్యలు పరిష్కరించేలా పాటు పడతామని అన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

-వేదవతి, ఆర్‌డిఎస్‌లకు ప్రభుత్వం నిధులు -ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కరువు జిల్లా కర్నూలును సస్యశ్యామలం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం సుంకేసుల గ్రామంలోని సుంకేసుల డ్యామ్ నుంచి కేసి కెనాల్‌కు కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరితో కలిసి ఆయన నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉంచేందుకు సిఎం చంద్రబాబు అహర్నిశలు కష్ట పడుతున్నారన్నారు. జిల్లాలో వేదవతి, ఆర్‌డిఎస్ ప్రాజెక్టుల నిర్మాణానికి దాదాపు రూ.4వేల కోట్ల నిధులను కేటాయిస్తూ మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. ఆ రెండు ప్రాజెక్టులతో పాటు గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించుకుంటే శాశ్వతంగా సాగు, తాగు నీటి కష్టాలు తీరుతాయన్నారు. ఇక తుంగభద్ర జలాశయానికి చెందిన గేట్లు దెబ్బతినడంతో, వాటి మరమ్మతుల దృష్ట్యా రబీలో సాగుకు నీరు అందించలేమని, ఈ విషయాన్ని అధికారులు రైతులకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రసాద్, గ్రామ సర్పంచి శ్రీరాములు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

-సుంకేసుల డ్యామ్ నుంచి కెసి కెనాల్‌కు నీటిని విడుదల చేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే

స్మార్ట్ మీటర్లు వద్దు

- కరెంట్ ఛార్జీలు తగ్గించాలి- సిపిఎం ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో కర్నూల్ బైపాస్ రోడ్డు తాయమ్మ కాలనీ, హబీబ్ ముబారక్ నగర్ కాలనీ, తేరు బజార్, లక్ష్మీపేట, శ్రీనివాస సర్కిల్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దు, కరెంటు చార్జీలు తగ్గించాలి అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ ఇంటింటి ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున స్మార్ట్ మీటర్లు వద్దని, కరెంట్ చార్జీలు పెరుగుతుండటపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం కార్యదర్శి పి. గోవిందు, సిపిఎం పట్టణ నాయకులు రాముడు, లక్ష్మీ నరసయ్య, రమేష్, సురేష్, అబ్బులు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన ప్రజా వ్యతిరేక భారాలను ఈ ప్రభుత్వం అమలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. రోజురోజుకు ప్రజల యొక్క కొనుగోలు శక్తి తగ్గిపోతుందని పుండు మీద కారం చల్లినట్లు బడా కార్పొరేట్లకు సంపాదన కూడా పెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున కరెంట్ సంస్కరణ పేరుతో ప్రజలను దోపిడీ చేయడాన్ని తీవ్రంగా నిరసించారు. ఇప్పటికే స్మార్ట్ మీటర్లు పెట్టుకున్న వ్యాపారస్తులు, విద్యాసంస్థలు, చిన్నాచితక పరిశ్రమలు, వృత్తిదారులు స్మార్ట్ మీటర్ల బిల్లులు భరించలేక తీవ్ర ఆవేదనకు గురి అవుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమీకరణలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రజలను నిలువు దోపిడీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ రూపంలో అవకాశం కల్పించడం హేయమైన విషయమన్నారు. గతంలో కరెంటు బిల్లు కట్టడానికి ఇబ్బంది ఉన్న ప్రజలకు 15 రోజులు గడువు ఇచ్చేవారని, ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకుండా పోయిందని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెట్టడానికి వ్యతిరేకిస్తూ జూలై 14వ తేదీ సోమవారం విద్యుత్ డివిజన్ కార్యాలయం వద్ద జరుగు ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. స్మార్ట్ మీటర్ల పోరాటాల యాత్రలో రవికుమార్, దావీదు, ఎం. రామన్న, వలి, హుస్సేన్, రఘునాథ్, మోహన్, భీమన్న, దాదా పీరా పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో ఇంటింటి ప్రచారంలో నాయకులు గోవిందు, తదితరులు

టిడిపి మోసపూరిత వాగ్దానాలు

- రాష్ట్రంలో దుర్మార్గపు, రాక్షస పాలన- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి- దేవనకొండ

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన టిడిపి ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మార్గపు, రాక్షస పాలన కొనసాగిస్తుందని ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి అన్నారు. మండల కేంద్రమైన దేవనకొండ మూగితాత దర్గా కమ్యూనిటీ భవనంలో ఆదివారం బాబు షురిటీ మోసం గ్యారంటీ మండల విస్తతస్థాయి సమావేశం వైసీపీ మండల కన్వీనర్ జెడ్పిటిసి కిట్టు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా స్థానిక బస్టాండ్ సమీపంలోని బిఆర్ అంబేద్కర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైసిపి కార్యకర్తలకు, నాయకులకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నిక ముందు ప్రజలకు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన టిడిపి ప్రభుత్వం హామీలను అమలు చేయ కుండా మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట అని పేర్కొన్నారు.అధికారంలోకి రాగానే వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు, కార్యకర్తలపై దాడులు,కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండి పడ్డారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి టిడిపి ప్రభుత్వాన్ని నిలదీసే ధోరణిలో ఆందోళన కార్యక్రమాలకు చేపట్టుతుంటే ఆంక్షలు విధించడం తగదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

అధికారంలోకి వచ్చి ఏడాదైనా పథకాల అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నారని గ్రామ గ్రామ,వాడవాడకు వెళ్లి ప్రజల్లోకి విస్తతంగా చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించాలని నాయకులకు,కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, వైసీపీ మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, నిజాలురెడ్డి, ప్రేమ్ నాథ్ రెడ్డి, దివాకర్ నాయుడు, నారాయణ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, రాజారెడ్డి, యూసుఫ్ భాష, కబీర్, మండల కో ఆప్షన్ సభ్యులు జుబేర్, ఎంపీటీసీలు తపాల శ్రీనివాసులు, నామాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి : ఎఐవైఎఫ్

ప్రజాశక్తి - మంత్రాలయం

తుంగభద్ర నదిలో పుణ్యస్నానానికి వెళ్లిన మృతి చెందిన కర్ణాటక రాష్ట్రం హాసనకు చెందిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం, శ్రీమఠం అధికారులు ఆదుకోవాలని ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి ఎం. రాజు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన యువకులు మృతి చెందడం విషాదకరమన్నారు. యువకుల మృతికి శ్రీమఠం పీఠాధిపతులు, ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్క వ్యక్తికి శ్రీమఠం వారు రూ.20 లక్షల నష్ట పరిహారం ప్రకటించి ఇవ్వాలన్నారు. అలాగే ప్రభుత్వం సైతం రూ. 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని ఎడల శ్రీమఠాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఉపాధి వేతనాలకు ఎదురుచూపులు

- ఏడు వారాలుగా ఒక్క పైసా జమ కాని కూలి - కుటుంబ పోషణ ఎలాగంటూ ఉపాధి కూలీల ఆవేదన

ప్రజాశక్తి - చిప్పగిరి

పూటగడవడం కోసం ఉపాధి హామీ కింద పని చేస్తున్న కూలీలకు వేతనాలు సక్రమంగా అందడం లేదు. ఏడు నెలలుగా ఒక్క పైసా జమ కాలేదు. దీంతో కూలీలు వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. వేతనాలు చెల్లించకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు..

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిందిస్థాయి ఉపాధి హామీ సిబ్బంది మాత్రం ఉపాధి కూలీలకు పనులను కల్పిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో నివసించే నిరుపేద కుటుంబాలు జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మాసాలలో బయటి ప్రాంతాలకు వెళ్లి పనులు చేసుకోవడానికి వలస వెళుతుంటారు. అయితే ప్రభుత్వం వలసలు నివారించడానికి తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పనులను కల్పిస్తున్నారు. పద్ధతి మంచిదైన చేసిన పనులకు వేతనాలు తొందరగా రావడం లేదని కూలీలు మనోవేదన చెందుతున్నారు. చిప్పగిరి మండలంలో ఉన్న 16 గ్రామాల లో కూడా ఉపాధి హామీ పనులు చేసుకున్న కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. మూడు వారాలకు ఒకసారైనా వేతనాలు అందితే మా జీవనం సక్రమంగా సాగుతుందని తెలుపుతున్నారు. "మాకు కేటాయించిన కూలి రోజులు ముగుస్తున్న కూడా మాకు వేతనాలు అందకపోతే మా జీవనం ఎలా కొనసాగించాలి. మా పిల్లలకు పాఠశాలలు మా పిల్లలకు పాఠశాలలు తెరిచిన వారికి దుస్తులు కానీ నోటు పుస్తకాలు కానీ ఇప్పించలేక, పిల్లలకు మన ఇబ్బందులు ఎన్ని ఉన్నా అప్పు చేసి కొనివ్వడం జరిగిందని" కూలీల ఆవేదన చెందుతున్నారు.

నెలాఖరుకు అందరికీ వేతనాలు: ఎపిఒ జుబేర్ అహ్మద్

ఉపాధి హామీ పనులు చేసుకునే వారందరికీ కూడా ఈ నెల ఆఖరి లోపల పెండింగ్లో ఉన్న వేతనాలు అందుతాయి. ఎవరు కూడా ఆందోళన చెందవద్దు. ఎవరికైనా బ్యాంకు లింకప్లో సమస్య ఉంటే తప్ప వారి అకౌంట్లోకి వేతనాలు జమ కావు. సమస్య ఉన్నవారు చిప్పగిరి కార్యాలయమునకు వారి బ్యాంకు పాసుబుక్కును, ఉపాధి హామీ పుస్తకమును, ఆధార్ కార్డును తీసుకొని వచ్చి పరిశీలించుకోవచ్చు.

వేతనాల కోసం ఎదురుచూస్తున్నాం
- ఉపాధి కూలి హుసేని

ఉపాధి వేతనాల కోసం ఎదురుచూస్తున్నాం.మాకు కేటాయించిన రోజులు కూడా పూర్తి కావస్తున్న వేతనాలు అందడం లేదు. మా జీవనం ఎలా కొనసాగించాలి. వేతనాలు వస్తాయి కదా అని అప్పులు చేసుకుంటున్నాం. తలకు మించి భారం అవుతుంది. తొందరగా ఇవ్వాలని కోరుకుంటున్నామన్నారు.

జీవనం ఎలా గడపాలి
- రాముడు ఉపాధి కూలి

ఏడు వారాలుగా ఉపాధి హామీ పనులు చేస్తున్న ఇప్పటివరకు ఒక వారం డబ్బులు కూడా రాలేదు. మా ఇంటి సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం, అధికారులు దయ వుంచి ఉపాధి వేతనాలను మంజూరు చేయాలి.

వేతనాలను వెంటనే మంజూరు చేయాలి
- సిపిఎండివిజన్ నాయకులు కెపి నారాయణస్వామి

ఆర్థిక ఇబ్బందులతో తల్లా డిల్లుతున్న ఉపాధి హామీ కుటుంబాలకు వారు చేసుకున్న ఏడు వారాల వేతనాలను వెంటనే వారి బ్యాంకు ఖాతాలకు జమ చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపడతాం.

అంగన్‌వాడీ ఆయాలకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - ఆదోని

అంగన్వాడి ఆయాలకు కనీస వేతనం అమలు చేయాలని సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న గోపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో నాయకురాలు సోమక్క అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలను అంగన్వాడీ ఆయాలకు అమలు చేయకుండా నామమాత్రం వేతనాలు ఇవ్వడం సరికాదు అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కే వెంకటమ్మ, రూరల్ ప్రాజెక్ట్ కార్యదర్శి వరలక్ష్మి మాట్లాడుతూ 55 సంవత్సరాల కిందట నుంచి అంగన్వాడీ ఆయాలు చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పెట్టుకుంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశవ్యాప్తంగా అంగన్వాడి యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాల ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఇప్పటికి రూ7000 పెంచుకున్నామని అన్నారు. అంగన్వాడి ఆయాలకు కనీస వేతనాల జీవో ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు మారిన ఆయాల వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐసిడిఎస్ సంస్థను నిర్వర్యం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలుగా ఇబ్బందులు గురిచేస్తున్నారని ఈ సంస్థను అంగన్వాడి ఆయాలు వర్కర్లు ఐకమత్యంగా రక్షించుకోవాలన్నారు. ఆయాగా పనిచేస్తూ అనారోగ్య కారణాలవల్ల చనిపోయిన వారి కుటుంబంలోని వారికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు, అంగన్వాడి ఆయాల 10వ తరగతి పాస్ అయితే వర్కర్ ప్రమోషన్లు ఇవ్వడానికి సిఐటియుగా జీవో సాధించుకున్నామని , ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీలను ఆయాలకు అమలు చేసి ఇన్సూరెన్స్ పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేతనాలు పెంపుకై రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు హక్కుల సాధన కోసం చేయవలసి వస్తుందని పిలుపునిచ్చారు. అనంతరం ఆయాల కమిటీ ఎంపిక జరిగింది. అధ్యక్షురాలుగా అపర్ణ, కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా వినోదమ్మ, కోశాధికారిగా నాగమణితో పాటు 13 మందితో కమిటీని ఎన్నుకున్నారు. ఆయాల సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీల ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతున్న నాయకులు

15లోగా పంటల బీమా చేసుకోవాలి

- మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్

ప్రజాశక్తి - మంత్రాలయం :

పత్తి వేరుశనగ పంటలకు రైతులు జులై 15వ తేదీ లోగా పంటల భీమాను చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత పంటలుగా ప్రభుత్వం గుర్తించిందని పత్తి పంటకిగాను ఎకరాకు రూ.2వేలు, అదే విధంగా వేరుశెనగ పంటకి గాను ఒక ఎకరానికి రూ.560 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రకృతి వైపరీత్యం వల్ల ఏదైనా పంట నష్టం జరిగితే పంటల భీమా వర్తిస్తుందని చెప్పారు. సమీపంలో ఉన్న సిఎస్సీలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మహిళపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి-పత్తికొండ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

కృష్ణా జిల్లా జడ్పి చైర్‌పర్సన్, వైసిపి బిసి మహిళా నాయకురాలు ఉప్పాల హారిక పై టిడిపి నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అటవీక పాలన కొనసాగుతుందని చెప్పడానికి నిదర్శనమని టిడిపి జనసేన నాయకులు కర్రలు, రాళ్లతో కారుపై పోలీసుల సమక్షంలోనే దాడి చేసి కారు అద్దాలు పగలగొట్టారన్నారు. తన దారిలో తాను వెళుతుంటే బిసి మహిళ అని చూడకుండా నోటితో చెప్పలేని విధంగా అసభ్య పదజాలంతో దూషించారన్నారు. టిడిపి బిసిలదని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఒక జిల్లా ప్రథమ పౌరురాలు అయిన బిసి మహిళ మీద దాడి చేయడం కనబడలేదా అని కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి రాజకీయం చేస్తున్నారని, రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో వైసిపి నాయకులు, మహిళలపై రోజురోజుకు దాడులు ఎక్కువయ్యాయని విమర్శించారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి

- వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కపట్రాళ్ల బొజ్జమ్మ

ప్రజాశక్తి- దేవనకొండ : మహిళల ఆర్థిక స్వాలంబనకు అక్షిత ఫౌండేషన్ కృషి చేస్తుందని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కపట్రాళ్ల బొజ్జమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కప్పట్రాళ్ళ గ్రామంలో కుట్టుమిషన్ దినోత్సవ సందర్భంగా అక్షిత ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో కప్పట్రాళ్ళ, జిల్లెడబుడకలలకు చెందిన పేద మహిళలకు సగం ధరలకే రాయితీపై 100 కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ అక్షిత ఫౌండేషన్ గ్రామాలలో కుట్టుమిషన్ ట్రైనింగ్ ఏర్పాటు చేసి మహిళలకు నేర్పించి వారిలో ఆర్థికస్వాలంబనకు కృషి చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. అక్షిత ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో బాబు మోసాలు బయటికి

వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే సిఎం చంద్రబాబు చేసిన మోసాలు బయటికి వస్తాయని వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. కల్లూరు మండల పార్టీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి అధ్యక్షతన 'బాబు షూరిటీ – మోసం గ్యారంటీ'పై ఆదివారం కల్లూరు మండలం, కల్లూరు అర్బన్ 16 వార్డుల్లో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో వైసిపి యువ నాయకులు కాటసాని శివ నరసింహారెడ్డి, వైసిపి కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, నారాయణ రెడ్డి, అరుణ, దండు లక్ష్మి కాంత్ రెడ్డి, మిద్దె చిట్టెమ్మ, పెద్దపాడు శ్రీధర్ రెడ్డి, బస్తిపాడు రమణారెడ్డి, కేశవరెడ్డి, అక్కిని హనుమంత రెడ్డి, భూపాల్ రెడ్డి, సత్యం రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, మద్దిలేటి, వేణుగోపాల్ రెడ్డి, శివశంకర్ రెడ్డి, చాంద్ బాషా, మస్తాన్, రామకృష్ణారెడ్డి, ఈశ్వరయ్య, శివవరం మహేష్ రెడ్డి, బెల్లం మహేందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, పుల్లారెడ్డి, రంగప్ప, నల్లబోలు గోపాల్ రెడ్డి, భీమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మఅవ్వ నగర్‌లో వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని మున్సిపాల్టీ పరిధిలోని 18వ వార్డు లక్ష్మమ్మ అవ్వ నగర్‌లో కనీస వసతులు రోడ్లు, వీధిలైట్లు కల్పించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కార్యనిర్వాహక కార్యదర్శి, ఆదోని మాజీ టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ గుడిసె కృష్ణమ్మ కోరారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆదోని పట్టణంలోని ఇంద్రనగర్ కాలనీలో ప్రజలకు అవసరమైన ప్రాథమిక వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కాలనీలో ఐదేళ్ల నుండి ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదన్నారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కాలువల నిర్వహణ సరిగా లేవన్నారు. వీధి లైట్స్ లేవని, వర్షాకాలం వచ్చే సరికి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని కాలనీవాసులు తెలిపారన్నారు. రోడ్లపై ఉన్న గుంతల్లో మోకాళ్ళ వరకు నీళ్లు నిలబడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. విద్యార్థులు, వృద్ధులు, గర్భిణులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా, ఇప్పటివరకు ఎటువంటి పరిష్కారం లేకపోవడం ప్రజల నిరాశకు కారణమవుతోందన్నారు. ఇప్పటికైనా పురపాలక శాఖలు తక్షణమే స్పందించి ఇంద్రనగర్ కాలనీలో రోడ్లు, కాలువలు, వీధిలైట్స్ వంటి ప్రాథమిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు. సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తనవంతుగా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

టిడిపి ఇంటింటి ప్రచారంలో గుడిసె కిష్టమ్మ

గళం విప్పిన మున్సిపల్ వర్కర్లు

ప్రజాశక్తి - ఆదోని

పనికి తగ్గ వేతనం పెంచాలని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు మరో మారు గళం ఎత్తారు ఆదివారం ఆదోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు ప్రదర్శన నిర్వహించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాల ప్రకారం నెలకు రూ.30వేలకు వేతనం పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, పట్టణ అధ్యక్షుడు తిప్పన్న డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నెల రోజులు నిరాశన చేశారన్నారు. చర్చల పేరుతో ఆలయాపన చేస్తూ సహనాన్ని పరీక్షించడం అధికారులకు తగదన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు కృష్ణమూర్తి, కర్రెప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను కూటమి ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు ఇస్తున్నటువంటి జీతాలు ఏమాత్రం సరిపోవటం లేదని కుటుంబాన్ని పోషించుకోవడానికి పిల్లలకు చెల్లించుకోలేక చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్సూరెన్స్ సౌకర్యాలు పని నైపుణ్యంను బట్టి జీతాలు పెంచాలని, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న వాటర్ సప్లై, ఎలక్ట్రికల్, ఎన్ఎంఆర్ కార్మికులకు జీతాలు పెంచి వారిని ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మహమ్మద్, వీరేష్, భాష, తిమ్మప్ప ,లోకేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు సబ్ స్టేషన్ ఎదుట ధర్నా : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు : స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ నేడు ఆలూరు సబ్ స్టేషన్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి. హనుమంతు, సీనియర్ నాయకులు కె పి. నారాయణస్వామి కోరారు. స్మార్ట్ మీటర్లతో పడే భారాని, కలిగే నష్టాని వారు ఆలూరు, హులేబీడు గ్రామాల్లో ప్రజలకు ఆదివారం వివరిస్తు కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను పగులగొట్టండి అని ప్రజలకు చెప్పిన మంత్రి లోకేష్, సిఎం చంద్రబాబు ఇప్పుడు వాటినే ప్రోత్సహించడం దుర్మార్గమన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు క్రిష్ణ, రత్నమ్మ, షేకున్‌బీ, గొసియాబీ పాల్గొన్నారు.

కౌతాళం : స్మార్ట్ మీటర్లపై కూటమి ప్రభుత్వం మాట తప్పిందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేష్ అన్నారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, పెంచిన విద్యుత్ బిల్లులు తగ్గించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ వీరన్న, ఉలిగయ్య, రామలింగప్ప, సిద్ధప్ప పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లపై ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకుల హనుమంతు

పేదలపై డిప్యూటీ ఎంపిడిఒ దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి-నందవరం

పంచాయతీ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యం వలన కొన్ని రోజుల క్రితం కొళాయి బంద్ అయింది. అప్పటి నుండి నీరు లేక కోట ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.రెండు రోజుల నుండి కొళాయి మరమతు పనులను అధికారులు చేపట్టారు.వీధి ప్రజలు 22 కుటుంబాలు ఉన్నాం. మాకు ఒక్క కులయి మాత్రమే ఉంది. ఇంకొక కులా ఇవ్వండి అని రెండు రోజులుగా పంచాయతీ సిబ్బందిని, డిప్యూటీ ఎంపిడిఒను బ్రతిమాలాడుతూ ఉన్నారు. ఆదివారం పైప్‌లైన్ కొరకు తవ్విన గుంతను మరమ్మతులు చేపట్టకుండానే కాలి గుంతను పూడ్చారు. ఏం తమాషాలు చేస్తున్నారా అంటూ పంచాయతీ అధికారులు వీధి ప్రజలపై దురుసుగా ప్రవర్తించారు. వాటర్ మెన్ బసవరాజు అయితే వయసులో పెద్దవాళ్ళను కూడా లెక్క చేయకుండా పెద్దవారిని, మహిళలను దూషించారు. డిప్యూటీ ఎంపిడిఒ వీధిలో వచ్చిన రోజున రెండు కుళాయిలు ఇస్తామని తెలిపారు. ఆయన పంచాయతీ అధికారులకు వారికి ఎట్టి పరిస్థితులలో వేరే కులాయి ఇవ్వద్దు అని చెప్పినట్లు వారు తెలిపారు. ఆయన ఫీల్డ్ లోకి రాకపోవడంతో ఫోను ద్వారా అడగగా కోటవీధిని నాశనం లేపారు. అంటూ ఆయన కూడా ఫోన్లో చిందులేశారు. కోటవీధిలో అధికారుల పర్మిషన్ లేకుండా ఇంటింటికి ఒక కొళాయి సుమారుగా 20 కులాలను వేరే లైన్ లో వేయించుకున్నారు. గ్రామము సుమారుగా 400 పైగా పర్మిషన్ లేకుండా కొలయాలు వేసుకున్నారు. వారిపైన ఈ అధికారి ఏ విధమైనటువంటి చర్య తీసుకోలేదు. మేము ఒక్క కొళాయి అడిగినందుకు మాపై ఇలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని వీధి ప్రజలు మండిపడ్డారు. మా వీధిలో 22 కుటుంబాలకి కలిసి ఒకే ఒక కొళాయి ఉంది.

ఆయన తనిఖీకి వచ్చినప్పుడు మా వీధిని పరిశీలించారు. మా పరిస్థితిని చూసి కూడా ఆయన మర్యాద లేకుండా మాట్లాడటం సరైన పద్ధతి కాదని తెలిపారు. మాపై జరుగుతున్న వీరి ఆగడాలపై చర్యలు తీసుకోవాలని వీధి ప్రజలు డిమాండ్ చేశారు.ముఖ్యంగా మహిళల పైన నోరు పారేసుకున్న వాటర్ మాన్ బసవరాజు పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి పైన చర్యలు తీసుకోకపోతే ఎంపిడిఒ ఆఫీసు ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. అక్కడ న్యాయం జరగకపోతే కలెక్టర్ దృష్టికి వెళతామని వీధి ప్రజలు తెలిపారు.

మహారాజ శ్రీ రాయదుర్గం జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.168 of 2019

Between:

J.జగ్గారెడ్డి ...వాది

And

Y.V.వెంకటేశ్వర్లు ...ప్రతివాది

To,

Y.V.వెంకటేశ్వర్లు S/o Y. వెంకోబరావు,
డోర్ నంబర్: 15/95, బళ్ళారి రోడ్, కర్నూలు-518002

సమన్లు

వాది ప్రామిసరి నోటు బాపత్తు వసూలు నిమిత్తం మీపై, పై దావా దాఖలు చేయడమైనది. కావున మీరు పై కోర్టులో తేది 24-07-2025 న ఉదయం 10:30 గంటలకు ఖుద్దున గానీ, వకీలు ద్వార గానీ హాజరై, ఆన్సరు దాఖలు చేసుకోవాలి. అట్లు మీరు హాజరు కాని యెడల, పై దావా మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియచేయడమైనది.

(By order of the court)

గౌని వెంకటరెడ్డి,
వాది తరపు న్యాయవాది,
రాయదుర్గం, అనంతపురం జిల్లా.